# వట్టిమాటలు కట్టిపెట్టోయ్

మహిళా సంవత్సరం - ! మహిళా సంవత్సరం ! ఎక్కడ చూసినా అదేమాట- ఏ పేరు చూసినా అదే వార్త ! సభలు సమావేశాలు, ఉపన్యాసాలు, సన్మానాలు - ఒకటే హడావిడి ఎక్కడ చూసినా.

ఆ వూర్లోను ఆ రోజు మహిళా సంవత్సరం సందర్భంగా, ఆ వూర్లోనే వున్న మూడు నాలుగు లేడీస్ క్లబ్‌ల వారందరూ కలిసి పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేశారు. ఓ మంత్రిణిగారు అధ్యక్షత వహించడానికి, ఓ ప్రముఖ నటిని, ఓ ప్రఖ్యాత రచయిత్రిని సన్మానించడానికి, ప్రసంగాలు, పార్టీ వగైరా వగైరా పెద్ద హంగామా ఏర్పాటు జరిగింది.

అనుకున్న రోజుకి, అనుకున్న టైముకి గంటన్నర ఆలస్యంగా మంత్రిణిగారు రావడం, సభ ఆరంభం కావడం జరిగింది- అధ్యక్ష ఉపన్యాసంలో మంత్రిణిగారు మహిళా సంవత్సరం అంటే ఏమిటి, మహిళా సంవత్సరంలో మహిళలు నెరవేర్చవలసిన కర్తవ్యాలను గురించి ఉద్బోధించారు. తరువాత నటిని, రచయిత్రని పట్టుచీరలతో సత్కరించి సన్మానించారు. వారిద్దరూ ఎవరికోణంలో వారు, స్త్రీ జనోద్ధరణకి పాటుపడాల్సిన రీతిని గురించి ప్రసంగించారు.

తరువాత క్లబ్బులో ముఖ్య మెంబర్లు కొందరు ఒక్కొక్కరు ఒక్కొక్క విషయంమీద ముందే క్షుణ్ణంగా రాసుకుని (రాయించుకునో) వచ్చిన విషయాలని చదివారు.

జడ్జీగారి సతీమణి మిసెస్ కాంతమ్మ, వరకట్నం నిర్మూలనం గురించి - కలెక్టరుగారి ధర్మపత్ని శారదా శ్రీనివాస్, స్త్రీ పురుష సమానత గురించి - ఎస్. పి. గారి భార్యామణి విమలాదేవి, స్త్రీ పునర్వివాహ

సమస్య గురించి, మహిళా కాలేజి ప్రిన్సిపాల్ సుమతీరెడ్డి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం, గురించి, బిజినెస్ మాగ్నెట్ గారి సతీమణి లతాసుందరం, "పతిత స్త్రీ జనోద్ధరణ గురించి" చాలా చక్కగా ఉపన్యాస పత్రాలు చదివారు - ప్రతి ఒక్కరి మనసుకి హత్తుకునేటట్టు విపులంగా వున్న ఆ వ్యాసాలు వింటూంటే, క్లబ్బు మెంబర్లందరికి తామందరూ అంతంత మంచి పనులు, అప్పుడే ఆచరణలో పెట్టేసినంత ఆవేశం, ఆనందం కలిగింది. చప్పట్లు మారుమోగాయి. మంత్రిణీగారు "ఈనాడు మీరందరూ ఇక్కడ వెల్లడించిన అభిప్రాయాలు మనందరం ఆచరించిననాడు "మహిళాభ్యుదయం" అన్న మాటకి మరి పని వుండదు." అంటూ సమావేశం ముగించారు. మహిళలందరూ చప్పట్లు యధాశక్తి చరిచారు. పార్టీతో సభ దిగ్విజయంగా ముగిసింది. అతిధులందరిని సాగనంపి నిర్వాహకులు పెద్ద బరువు దింపుకున్నట్టు నిట్టూర్చి కార్ల దగ్గరకి నడిచారు.

— కారెక్కబోతూంటే కారులో శుభలేఖల కట్ట చూడగానే జడ్జీగారి సతీమణి కాంతమ్మ - "అయ్యో నా మతి మండిపోనూ, అందరూ కలుస్తాం ఏకంగా శుభలేఖలు పంచడం సులువుగా అవుతుందని తెచ్చి యివ్వడమే మరచిపోయాను" - అంది శుభలేఖలు తీస్తూ- ఆవిడ ఒక్కగా నొక్క కొడుకు - కొత్తగా అయిన కలెక్టరు పెళ్ళి, అంతా శుభలేఖలు అందుకుంటూ పెళ్ళికూతురు వివరాలు, కట్నాలు, కానుకలు, ఏమిటంటూ ప్రశ్నలు గుప్పించారు – కాంతమ్మగారు గర్వంగా నలుగురివంకా ఒకసారి చూసి "కట్నం ఏమీలేదు. అయినా యింకా ఈ రోజుల్లోనూ కట్నాలేమిటి లెద్దూరూ - " ఈసడింపుగా అంది. కట్నం లేకుండా కలక్టరు అల్లుడిని సంపాదిస్తున్న తల్లిదండ్రుల్ని చూసి ఆడపిల్లల తల్లులు ఈర్ష్యపడ్డారు. కాని కాంతమ్మగారు కట్నం లేదందిగాని కానుకలు లేవనలేదు పాపం. అసలు వొక్కగా నొక్కడు - బంగారంలాంటి ఉద్యోగస్థుడికి వేలకి వేలు యిస్తాం, అని వస్తుంటే కట్నం వద్దంటారేమిటి, మతిపోయిందా మీకు, అంటూ ఆవిడ మొగుడ్ని కొడుకుని సాధించింది- కొడుకు ససేమి కట్నం

తీసుకోనంటే, తండ్రి దాన్ని బలపరుస్తుంటే ఆవిడ కోపగించి, సాధించి ఆఖరికి వాళ్ళ అభిప్రాయాన్ని మార్చలేక, పాపం ఉత్తి లాంఛనాలతో సరిపుచ్చుకుంది - వెయ్యి నూటపదహార్లు అత్తగారి లాంఛనం, ఆడపడుచులిద్దరికి చెరి ఐదువందలు, ఖరీదైన పట్టుచీరలు, స్టీలు పానకం బిందెలు, అల్లుడికి వాచి, ట్రాన్సిష్టరు, వెండికంచం, చెంబు, రాళ్ళ వుంగరం, సూట్లు, ఫస్టుక్లాసు ప్రయాణం ఖర్చులు, వగైగా వగైరా ఓపికున్నన్ని లిస్టులు రాసి కట్నం డబ్బులో సగమైన రాబట్టకలిగినందుకు సగం సంతోషించింది. ముందు కట్నం తీసుకోనందుకు బాధనిపించినా తరువాత తరువాత దానివల్ల తమకి కల్గిన నష్టం అట్టేలేదని ధృడపర్చుకున్నాక, కట్నం తీసుకోవడం లేదని చెప్పుకోడం బాగానే వుందనిపించి, గర్వంగా అడిగినవారికి, అడగనివారికి కట్నంలేదు, తీసుకోడంలేదంటూ చెప్పుకొంటూ సంతృప్తి పడసాగింది ఆవిడ—

"అంతా మీలాగే వుంటే, మాలాంటి ఆడపిల్లలవాళ్ళం ఎప్పుడో బతికిపోయేవాళ్ళం అండీ" అంటూ నలుగురు ఆడపిల్లల తల్లి కమ్మలమ్మ మెచ్చుకుంది.

"మీలా చెప్పింది చేసేవారెవరండీ - ముందు ఉపన్యాసాలు వెనక తమదాక వచ్చేసరికి ఉపన్యాసాలు గాలిలో కలిసిపోతాయి. ఆడవాళ్ళందరూ యిలా ఆలోచిస్తే, ఈనాడు ఇంతమంది ఆడపిల్లలు పెళ్ళిళ్ళు కాకుండా వుండేవారా ?" ఓ ప్లీడరుగారి సతీమణి జడ్జిగారి పతీమణిని ఎందుకైన మంచిదన్న ముందుచూపుతో మరీ మరీ మెచ్చుకుంది. అందరి పొగడ్తలకి అసలే లావయిన కాంతమ్మ మరింత ఉబ్బిపోయి గంటక్రితం తను చెప్పిన మాటలప్పుడే మరిచిపోయి, చాలా గర్వంగా కారెక్కింది.

• • •

కలక్టరుగారి సతీమణి కారు దిగేసరికి - వీధి వరండాలో బోనులో పడ్డ పులిలా పచారు చేస్తున్న కలక్టరు భర్తగారిని చూడగానే గతుక్కుమంది. ఆయనగారు ఢిల్లీలో ఏదో మీటింగ్‌కి రాత్రి ఫ్లైట్‌కి వెళ్ళాలని

బట్టలు అవి సర్ది అన్నీ రెడీగా వుంచాలని చెప్పిన మాట శారదాదేవి క్లబ్బు మీటింగుల్లో ఆ హడావిడిలో పడి మరిచిపోయింది - ఆయన్ని చూడగానే ఆ సంగతి గుర్తువచ్చి రాబోయే ప్రళయాన్ని తలుచుకుని బితుకు బితుకు మంటూనే మెట్లెక్కింది — ఆవిడ పూర్తిగా లోపలికి రాకుండానే కలక్టరుగారు డ్రైవరు, బంట్రోతులు వున్నారనైనా లేకుండా ఆవిడమీద యింతెత్తు ఎగిరారు. ఆవిడ నిర్లక్ష్య వైఖరిని, మొగుడంటే లెక్కలేని అహంకారాన్ని, తనమాట లెక్కచేయని భార్యని సహించనని, ఈ క్లబ్బులు వేషాలు మానకపోతే మర్యాద దక్కదని చాలా గట్టిగ ఎన్నోసార్లు దుమ్మెత్తిపోసిన విషయాన్ని మరోసారి చెప్పి ఆపారు. శారదాదేవిగారు అతిసౌమ్యంగా క్లబ్బు గొడవలో తీరికలేక మరిచావని ఎంతసేపు నిమిషయంలో సర్దుతానని ఆయనగారికి నచ్చచెపుతూ శాంతపరుస్తు చకచక ఆయన సూట్ కేసు వగైరాలు సర్దసాగింది. కలక్టరుగారు ఖచ్చితమైన మనిషి, పనిలో ఖరాఖండీ అయినవాడని ఆఫీసులో అంతా అంటారు. ఆయనగారు కింద ఉద్యోగుల ఏ తప్పులని క్షమించడు. ఆ రూలు ఆయన ఇంట్లో పెళ్ళాంకి కూడ వర్తింపచేస్తాడు. భర్త అన్న పదానికి ఆయన సరి అయిన నిర్వచనం ఇస్తున్నట్టు భరించే భార్య భర్త చెప్పుచేతల్లో వుండాలని ఆయన నమ్మకం. శారదాదేవి ఆ మాట మరిచిపోకుండా ఆయన ఏ చిన్న లోటుపాటుని క్షమించరు.

శారదాదేవి చదువుకుంది. మంచి ఇంట్లోంచి వచ్చింది. కలక్టరు మొగుడయినందుకు ఇంట్లోవాళ్ళు, వూళ్ళోవాళ్ళతో పాటు ఆవిడకూడా మొదట్లో అదృష్టం అనుకుంది. కాని ఆవిడ అంచనాలన్నీ భర్తగారి విషయంలో తలక్రిందులయ్యాయి. తనదే పైమాటగా వుండాలనే పట్టుదల, సనాతనాచారాలపట్ల మోజు, ఆడదంటే అణగి మణిగి వుండాలనే ఆయన మనస్తత్వం అర్థం అయ్యాక ఆయనని సంస్కరించాలని ఆవిడ చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాక - కలక్టరు భార్య హోదాని, ఇద్దరు పిల్లల్ని, వంశం, పరువు ప్రతిష్టలని ఏదీ వదులుకోలేని బలహీనతతో ఆయన కనుగుణంగా మారక తప్పలేదు ఆవిడకి. లోకానికి తామిద్దరిది ఆదర్శదాంపత్యం అన్నట్టు నటిస్తూ- కలక్టరుగారి భార్యగా సొసైటీలో తన

పాత్ర నిర్వహించడానికి, ఇంట్లో భర్త అదుపాజ్ఞలని జవదాటకుండా ఉండ డానికి రెంటికీ పొత్తు కుదరక ఆవిడ ఇంటా బయటా రెండు రకాల పాత్రలు నటించి వప్పించలేక నానా బాధ పడుతోంది.

కలక్టరుగారు కారెక్కి వెళ్ళాక ప్రళయం సద్దుమణిగినట్లు ఇల్లు నిశబ్దమయింది. శారదాదేవి రెండురోజులు హాయిగా వుండొచ్చు నను కుంటూ అలిసిపోయిన శరీరాన్ని పక్కమీదకి వాల్చి నిట్టూర్చింది. అంతకు గంట క్రితం క్లబ్బులో తానిచ్చిన ఉపన్యాసం తల్చుకుంటే ఆవిడకే నవ్వు వస్తూంది....

♦ ♦ ♦

డిన్నరు టేబిల్ దగ్గర కోడలు చెప్పిన మాట వింటూనే విమలా దేవి చకితురాలై కోడలివంక గుడ్లప్పగించి చూసింది - ఎస్. పి. గారు కోడలివంక, భార్యవంక ఒకసారి చూసి ఏదో చెప్పబోయి, భార్య మొహం చూసి గిపోయి తల వంచుకుని అన్నం తినసాగాడు. తను చెప్పదలచింది చెప్పి పని అయిపోయినట్లు, ఆలోచించుకోండి అన్నట్టు అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది గదిలోకి - భర్తపోయిన రెండేళ్ళనించి ఉద్యోగం చేసుకుంటూ అత్తవారింట్లో వున్న కుసుమ.

"ఏమిటండీ యీ ఘోరం —" ఆఖరికి విమలాదేవి షాక్ నించి తేరుకుని అడిగింది—

"ఏముంది. రోజులు మారుతున్నాయి - అయినా యిదీ మంచి దేలే — పాపం ఆ అమ్మాయి మాత్రం ఎన్నాళ్ళిలా వుంటుంది" అన్నారు.

"మతిపోయిందా ఏమిటి మీకూనూ - అవ్వ! ఇదేం విడ్డూరం. మొగుడు పోయి రెండేళ్ళయిందో లేదో మళ్ళీ పెళ్ళికి తయారవుతుందా - ఇదేం విదేశం అనుకుందా ఏమిటి రోజుకో పెళ్ళి చేసుకోడానికి? ఇంక మనం నలుగురిలో మొహం ఎత్తుకు తిరగాలా వద్దా - ఈవిడలాంటి పని చేస్తే మన ఆడపిల్లలు పెళ్ళిళ్ళు అవుతాయా - ఇవన్నీ ఆలోచించ

కుండా పైగా మంచి పనేలే అంటూ ఆవిడ్ని సమర్థిస్తున్నారేమిటి?" గయ్యిమంది విమలాదేవి.

"అయినా వాడు పోయి రెండేళ్ళయినా పూర్తికాలేదు, దాని మనసు ఎలా వప్పిందో - తగుదునమ్మా అంటూ రెండో పెళ్ళికి తయారయింది. దీనికి బుద్ధిలేకపోతే ఆ చేసుకొనేవాడెలా వప్పుకున్నాడో-"

"చూడు విమలా! మన రోజులు వేరు యీ రోజులు వేరు. ఆ అమ్మాయి చదువుకున్నది, తన బాగోగులు తను ఆలోచించుకో లేదంటావా - మన కోసం అని, లోకం కోసం అని, ఆ అమ్మాయి స్వసుఖాన్ని ఎందుకు వదులుకుంటుంది - మనం అర్థం చేసుకోవాలి -" అని నెమ్మదిగా ఏదో నచ్చచెప్పబోయారు.

"చాల్లెండి! ఊరుకోండి - తలుచుకుంటే నా వళ్ళు మండి పోతుంది. వాడు పోయి".... కోడలు అత్తమామల మాటలు గదిలోంచి వింటూనే వుంది. వాళ్ళెంత నెమ్మదిగా చర్చించుకుంటున్నా ఆ మాటలు ఆమెకు వినిపించనంత నెమ్మదిగా లేవు, అంతవరకు విన్న కోడలు చరచరా గదిలోంచి వచ్చింది - "అత్తగారూ మీకీ విషయం యింత మండిస్తుందని తెలిస్తే ముందే చెప్పక పోయేదాన్ని, ఏదో యిందాక స్త్రీ పునర్వివాహం గురించి అంత ఆవేశంగా ఉపన్యాసం యిస్తే యీ వార్త విని నన్నభినందించి ఆనందిస్తారన్న అపోహతో ముందుగా చెప్పాను. అదంతా కేవలం వట్టి మాటలని, ఆ ఉపన్యాసం మరొకళ్ళకే నని మనకి కాదన్న సంగతి తెలిస్తే ఆ పెళ్ళి చేసుకొచ్చాకనే చెప్పే దాన్ని, భర్తపోతే ఏడాది కళ్ళు వాచేట్లు ఏడిచాను మరో ఏడాది జీవచ్ఛంలా బతికాను. నామీద మీకేదో ప్రేమ సానుభూతి వున్నాయనుకున్నాను. కన్న కూతురిలా చూసుకుంటున్నారని ఆనందించాను, యిదే మీ కూతురయితే ఆమె బతుకంత యిలాగే పడివుండాలని కోరేవారా. ఇన్నాళ్ళ బట్టి మీ ప్రేమ అభిమానం అంతా నేను తెచ్చే ఆరువందలమీద అని యిప్పుడర్థం చేసుకున్నాను. ఏడిచినన్నాళ్ళు ఏడిచాను. యింకా ఏడుస్తూనే బతికే ఓపిక నాకు లేదు. మీరంగీకరించి ఆశీర్వదించితే మంచిది. ఏదన్నా ఈ

పెళ్ళి జరుగుతుంది" కుసుమ కాస్త వ్యంగ్యంగా, కటువుగానే అనదలిచింది అనేసింది. విమలాదేవి ఏం చెప్పాలో తెలియక తడబడి మొహం ఎర్రబరుచుకుంది.

• • •

మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ సుమతీరెడ్డి ఆవిడగారి భర్తకంటె ఎక్కువే సంపాదిస్తూంది. పెళ్ళికి బి. ఏ. చదివిన ఆవిడ పెళ్ళయ్యాక ఎమ్మే చదివి కాలేజి లెక్చరరు అయి అలా ప్రిన్సిపాల్ అయింది. కాని ఆవిడ భర్త మాత్రం బి. ఏ., బి. యిడి. పెళ్ళికి ఆవిడకంటె ఎక్కువ చదివినా తరువాత ఆవిడకంటె తక్కువ హోదాలో, తక్కువ సంపాదనలో ఆవిడ కంటె వెనక్కి పడ్డాడు, అది ఆయనకి చాలా అవమానంగా వుంది. అలా అని భార్య తెచ్చే జీతం డబ్బులు పోగొట్టుకోడం యిష్టం లేదు. భార్య తనని ఎక్కడ చులకనగా చూస్తుందోనని ఆయన ముందరి కాళ్ళకి బంధంలా ఆవిడని ముందునించి అదుపాజ్ఞలో పెట్టి, ఆవిడ ఎంత చదివినా ఎంత సంపాదించినా, మొగాడు, భర్తకి తలొంచవలసిందే అన్న సూక్తి ఆవిడని ఎంతమాత్రం మరిచిపోనీయడు. ఆవిడ సంపాదన నయాపైసలతో జీతం వచ్చిన రోజున ఆయన చేతిలో పెట్టాల్సిందే. ఆవిడకి కావల్సిన స్వంత ఖర్చు ఆయన చేతి మీదుగా తీసుకోవలసిందే. ఆవిడ కారేజీ నుంచి ఆలశ్యంగా వచ్చిన నాడు సంజాయిషీ యిచ్చుకోవలసిందే - అలా జరగనినాడు యిల్లు పీకి పందిరివేసి, వూరువాడ వినేటట్టు అరుస్తాడు - ఆడదానికి ఉద్యోగం వల్ల వచ్చే అతిశయాన్ని దుమ్మెత్తి పోస్తాడు యిరుగు పొరుగు ముందు. ఆవిడ ఏ రోజన్నా ఓర్మి నశించి జవాబు చెప్తే ఉద్యోగం మానమంటూ చిందులు తొక్కుతాడు. ఆవిడ ప్రాణం విసిగి ఉద్యోగం మాని భర్త తిక్క కుదర్చాలనుకుంటుంది కాని దానివల్ల తను ఐదుగురు పిల్లలు తట్టుకోవలసిన ఆర్థిక యిబ్బందులు గుర్తు రాగానే ఆ యిబ్బంది కంటె ఈ నరకమే నయం అనుకుని ఆవేశం అణుచుకుంటుంది. అలా రాను రాను ఆవిడ కింక భర్తతో వాదించి, దెబ్బలాడే ఓపిక నశించి యిరుగు పొరుగు

మధ్య కాపురం రచ్చ కీడ్చుకోలేక ఆయనని ఏ విషయంలోనూ ఎదిరించడం మానుకుంది.

ఆవిడ క్లబ్బునించి ఆలశ్యంగా యింటికొచ్చేసరికి ఎదురు చూసే వాతావరణమే వుంది యింట్లో - భర్తగారు చిందులు తొక్కుతున్నారు. పెద్దకూతురు తండ్రికి కాఫీ టిఫిను యిచ్చి, అన్నం వండి అన్నీ ఏ లోటు రాకుండా చేసినా భార్యామణి వేళపట్టన యింటికి రాలేదని ఆయన ధుమ ధుమ లాడుతున్నాడు. ఆవిడ యింటికి చేరేసరికి వీధి వాకిట్లోనే వురిమి చూస్తూ "ఏం యిల్లు కనపడిందా, మరి నాలుగూళ్ళు తిరిగి రావల్సింది. అయినా నీకీమధ్య తిడుగుడెక్కువయ్యింది. మొగుడు, సంసారం వుందన్న గుర్తు లేదులా వుంది. మహా పెద్ద ఉద్యోగస్తురాలునని మిడిసిపాట్లు కాబోలు - యిదిగో నీ ఆటలు నా దగ్గిర సాగవు" ఆ మాటలన్నీ ఆవిడ యిదివరకు చాలాసార్లు విన్నవే కనక ఆవిడకి కొత్తాలేదు, బాధా లేదు - అంచేత సావకాశంగా బట్టలు మార్చుకుని పిల్లలకి అన్నాలు పెట్టే ప్రయత్నాలు చేయసాగింది నిర్లిప్తంగా. యీ సంసారం యింతే, యీ బతుకింతే, యీ ఆడజన్మ యింతే ఎన్నోసార్లు అనుకునేమాట ఆ రోజు మరోసారి అనుకుంది ఆవిడ.

• • •

"అమ్మగారూ - నేనేం పాపం ఎరుగనండీ - అదే .... మాయ మాటలు చెప్పి నా కొంప ముంచాడండి —— మీ పాదాల తోడండి అమ్మగారు, నన్నుంపేయకండి అమ్మగోరూ—" సీతాలు లతాదేవి కాళ్ళు పట్టుకుని గోడుగోడున ఏడుస్తూంది. దాని ఏడుపు ఆవిడని ఏమి కరిగించడం లేదు. అది చేసిన వెధవ పని తలుచుకుంటే ఆవిడ వుడికిపోతూంది.

"ఛీ - ఫో, దొంగముండా నీకేం తక్కువ దానినా - ఏం తెలీనట్లుండి యింత నాటకం ఆడావా, ఎంత ధైర్యం నీకు - యింట్లో వుండి చాటు మాటుగా నా కన్ను కప్పి యింతకి తెగించావంటే .... నిన్నేం చేస్తే పాపం వుంటుంది. వాడికి బుద్ధి లేకపోతే నీ బుద్ధి ఏమ

యిందే _ వాడితో సరసాలాడినప్పుడు లేదూ యీ బుద్ది - కొంప మునిగాక నా కాళ్ళు పట్టుకుంటే నేనేం చేస్తాననుకున్నావు .... " ఆవిడి తిరస్కారంగా కోపంగా అంది.

"తల్లితోడమ్మగోరూ - ఆడిదింత కుత్సితపు బుద్ధి అనుకోలేదండమ్మోగోరూ - ఆడదాన్ని ఆడు అర్ధరాత్రి గదిలో జొరబడితే నేనేం సేత్తానమ్మగోరూ - అడి కాళ్ళట్టుకున్నాను. నీ సెల్లెలులాంటి దాన్నిరా అన్నాను తాగుబోతు నంజకొడుకు వాడికి సెల్లేమిటి, తల్లేమిటి నా మాట నమ్మండమ్మగోరు నేనే పాపం ఎరగనండి - మీరే దిక్కమ్మగారూ...."

ఆ దీనాలాపాలు లతాదేవిని కరిగించలేదు - యింట్లో వున్న అరడజనుమంది నౌకర్లలో పద్దెనిమిదేళ్ళ సీతాలు ఆవిడకి పర్సనల్ అసిస్టెంటు లాంటిది. ఆవిడ చీరలు మడతపెట్టడం, ఆవిడకి తలంటు పోయడం, చిక్కు తీయడం, అవిడి ముస్తాబవుతుంటే అన్నీ అందించడం ఆవిడ ఎక్కడికైనా వెడితే వెంట వెళ్ళడం, ఆవిడికి జోళ్ళందించడం ఒకటేమిటి ఆవిడ యింట్లో వున్నంత సేపు బాడీ గార్డులా తిరుగుతూంటుంది. ఆ సీతాలు. ఆ పద్దెనిమిదేళ్ళ సీతాలు కన్నెరికాన్ని ఆవిడ డ్రైవరు అపహరించాడు. సీతాలు భయపడి ఆ రహస్యం తనలో దాచుకోవాలన్నా ప్రకృతి సహాయం చెయ్యలేదు. మూడు నెలలుగా సీతాలు వ్యవహారం ఆవిడకి అనుమానంగానే వుంది. ఇంకే తోవలేక సీతాలంతట సీతాలే ఈ రోజున తన గుట్టు ఆవిడ కాళ్ళమీద పడేసి రక్షించ మంటూ ఏడుస్తూంది, లతాదేవి తల్చుకుంటే సీతాలు రహస్యం కాపాడగలిగే డబ్బు వుంది - లేదంటే ఆ తప్పుని వప్పుగా పబ్లిక్గా ఆ డ్రైవరుకో, మరోడికో ఇచ్చి ముడిపెట్టగలిగే సామర్థ్యమూ వుంది. కాని ఆవిడకి యిలాంటివి ప్రోత్సహించడం యిష్టం వుండదు - సీతాలు చేసిన తప్పుని యింత తొందరగా క్షమిస్తే మరొత్తి యిలా చేస్తే - యీ వెధవలందరిని ఉద్ధరించడమేనా తన పని - మరేం పని పాట లేదా ఏమిటి తనకి - అయినా సీతాలు వ్యవహారం లాంటి చిన్న చిన్న

వ్యవహారాలతో బుర్ర బద్దలు కొట్టుకోడం ఆవిడకి యిష్టం లేదు. ఆవిడకి అవతల బోలెడు పనులు మహిళా సమాజాలు, అనాధ శరణాలయాలు, పతితజనోద్ధరణ - బోలెడు సంఘాలు, సమాజాలు, క్లబ్బులు, పార్టీలు ఆవిడకి అ పనులతో ఊపిరే ఆడదు — సీతాలు లాంటి చిన్న సమస్యలలో ఆవిడ టైము వేస్టు చేసుకోడం యిష్టం వుండదు. అంచేత సీతాలుకి చాలా గట్టిగా చెప్పి కావలిస్తే మరో నెల జీతం పట్టుకు ఫో అంతేగాని యీ గొడవ నాకొద్దు. నీ తప్పుకి నేను బాధ్యురాలినా — అంటూ కసిరి హేండ్ బ్యాగులోంచి ఓ ఏభై రూపాయిలు విసిరి .... ఓ మీటింగుకి టైమయిపోతూంటే హడావిడిగా కారెక్కి వెళ్ళిపోయింది.